ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY

మంచిర్యాల
జిల్లా వార్తలు

5

బుధవారం 20 మార్చి 2024

ఉపాధిహామీ పనులు పరిశీలన

మందమర్రిరూరల్, మార్చి 19: మండలంలోని అందుగులపేట గ్రామంలో చేపడుతున్న ఉపాధిహామీ పనులను మంగళవారం ఎంపీడీవో రాజేశ్వర్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీలు ఉదయం పూట పనులను చేయాలని చెప్పారు. వేసవిలో మొక్కలు ఎండిపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

ఇఫ్తార్ | 6:28
బుధవారం
సహర్ | 4:58
గురువారం

మాజీ సింగరేణి సీఎండీకి షాక్

మంచిర్యాల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ ప్రభుత్వకాలంలో సింగరేణి సీఎండీగా పనిచేసిన ఎన్.శ్రీధర్‌కు కేంద్ర ప్రభుత్వం షాకిచ్చింది. గత ఏడాది మార్చి 18న పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ సెలక్షన్ బోర్డు ద్వారా ఎన్ఎండీసీ సీఎండీ పోస్టు కోసం ఇంటర్వ్యూ జరుగగా, ఎన్ శ్రీధర్ ఎంపికయ్యారు. కాగా ఇటీవల అతనిపై పలు అవినీతి ఆరోపణలు రావడం, అవి సీవీసీకి చేరడంతో కేంద్ర బొగ్గు గనుల శాఖ శ్రీధర్ ఎన్ఎండీసీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టకుండా అడ్డుకున్నట్లు తెలిసింది. అంతేకాకుండా పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ సెలక్షన్ బోర్డు ప్రతిపాదనను అప్పాయింట్‌మెంట్ ఆఫ్ క్యాబినెట్ కమిటీ తిరస్కరించి, సీఎండీ ఎంపిక ప్రక్రియను మళ్లీ చేపట్టాలని ఆదేశించినట్లు తెలిసింది.

సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం



మాట్లాడుతున్న ఎస్సీ కార్పొరేషన్ ఈడీ చాతరాజు దుర్గప్రసాద్

మందమర్రి టౌన్, మార్చి 19: సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమని, మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే అది సాధ్యమవుతుందని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ చాతరాజు దుర్గప్రసాద్ అన్నారు. వయోజన విద్యాశాఖ, లయన్స్ క్లబ్ ఆఫ్ మంచిర్యాల సఖి ఆధ్వర్యంలో మందమర్రి పట్టణంలోని శ్రీపతినగర్‌లో నిర్వహిస్తున్న కుట్టు శిక్షణ కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు చాలా మంది స్వయం ఉపాధి శిక్షణ కోర్సులను పూర్తి చేసుకొని ఆర్థిక ప్రగతిని సాధిస్తున్నారన్నారు. స్వయం ఉపాధి పొందుతున్న మహిళలు కుటుంబాలకు పెద్ద దిక్కుగా నిలుస్తున్నారని చెప్పారు. మహిళలు తలుచుకుంటే ఏ రంగంలోనైనా రాణిస్తారని తెలిపారు. శిక్షణ పూర్తి చేసిన వారికి ప్రభుత్వం ఉపాధి కల్పించే విధంగా కృషి చేస్తామని తెలిపారు. వయోజన విద్యాశాఖ అధికారి పురుషోత్తం నాయక్ మాట్లాడుతూ ప్రతీ ఒక్క శిక్షకురాలు కనీసం చదువురాని ఐదుగురికి అక్ష రాలు నేర్పించాలని పిలుపునిచ్చారు. విద్యకు వయసుతో సంబంధం లేదని, ఏకాగ్రత ఉంటే చా లని అన్నారు. సులభ పద్ధతిలో వారికి చదువు చెప్పాలన్నారు. వయోజనులకు విద్య నేర్పడం ద్వారా వారి మనసుల్లో నిలిచిపోతారని అన్నారు. జ్ఞానాన్ని ఇతరులకు పంచితే సమాజం అభివృద్ధి చెందుతుందని వివరించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ కొండపల్లి అశోక్ రావు, శిక్షణ కేంద్రం కో - ఆర్డినేటర్ ఉప్పులేటి గోపిక, ట్రైనర్ యు శారద, ఉప్పులేటి నరేష్, రామసాని శేఖర్ పాల్గొన్నారు.

మహిళలకు అవగాహన

జైపూర్, మార్చి 19: జైపూర్‌లోని మండల సమాఖ్య కార్యాలయంలో మంగళవారం డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో జైపూర్, భీమారం మండలాల మహిళ సంఘాల సభ్యులకు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మహిళ సంఘాల ద్వారా యూనిఫాం కుట్టించే కార్యక్రమంపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఆర్‌డీవో కిషన్ మాట్లాడుతూ 1 నుంచి 3 తరగతి వరకు ఒక రకమైన యూనిఫాం, 4 నుంచి 5 వరకు ఒక రకమైన యూనిఫాం, 6 నుంచి 12వ తరగతి వరకు ఒక రకమైనయూనిఫాం కుట్టాల్సి ఉంటుందన్నారు. బాలురుకు 1 నుంచి 5 వరకు షర్ట్, నిక్కర్, 6 నుంచి 12వ తరగతి వరకు షర్ట్, ప్యాంటు కుట్టాల్సి ఉంటుందని చెప్పారు. ఒక యూనిఫాం కుట్టడానికి ప్రభుత్వం రూ. 50 ఇస్తుందన్నారు. మే 30వ తేదీ వరకు మండలంలో ఉన్న 37 పాఠశాలల్లో 2,069 మంది విద్యార్థులకు యూనిఫాంలు కుట్టాల్సి ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో డీపీఎం సంజీవ్, ఏపీఎం రాజ్‌కుమార్, త్రయంబకేశ్వర్, సీసీలు మహిళా సంఘాల మహిళలు పాల్గొన్నారు.

కొండగట్టులో ఎమ్మెల్యే వివేక్ పూజలు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి

మందమర్రి టౌన్, మార్చి 19: జగిత్యాల జిల్లాలోని కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుటుంబ సభ్యుల పేరిట అర్చనలు చేయించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. వర్మ నవీన్ అనే కార్యకర్త చెన్నూరు ఎమ్మెల్యేగా గెలిస్తే కొండగట్టును దర్శించుకుంటామని మొక్కుకున్నారు. దీంతో ఎమ్మెల్యే కొండగట్టులో పూజలు చేసి కొబ్బరి కాయలు కొట్టారు. ఎమ్మెల్యేతో పాటు అఖిలభారత యాదవ సంఘం మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు బండి సదానందయాదవ్ ప్రత్యేక పూ జలు చేశారు. ప్రధాన అర్చకులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

దరఖాస్తులకు ఆహ్వానం

ఏసీసీ, మార్చి 19: పోలీసుశాఖ ఆధ్వర్యంలో మంచిర్యాల పట్టణంలోని పోలీస్ స్టేషన్ పక్కన నూతనంగా ఏర్పాటు చేస్తున్న ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ పెట్రోల్ బంక్‌లో పనిచేసేందుకు అర్హులైన యువతీ, యువకులు దరఖాస్తులు చేసుకోవాలని రామగుండం సీపీ శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంధనం ఫిల్లింగ్ చేసే ఉద్యోగ ఖాళీలు 15, టైర్లలో ఎయిర్ ఫిల్లింగ్ చేసే ఖాళీలు 2, స్కావెంజర్ 1 ఖాళీ ఉన్నట్లు తెలిపారు. ఇంధనం ఫిల్లింగ్ చేసే ఉద్యోగం కోసం దరఖాస్తు చేసుకునే వారు 35 సంవత్సరాలలోపు ఉండాలని, ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులు అర్హులని తెలిపారు. ఎయిర్ ఫిల్ చేసే వారు పదో తరగతి ఉత్తీర్ణులై 35 సంవత్సరాలోపు ఉండాలని, స్కావెంజర్ 35 సంవత్సరాలలోపు ఉండాలని పేర్కొన్నారు. వివరాల కోసం ఆర్మ్డ్ రిజర్వు ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ 9652225673ను సంప్రదించాలని, దరఖాస్తులను ఈ నెల 22లోగా పెట్రోలు బంక్‌లు అందించాలని తెలిపారు.

అక్రమంగా నిర్మించిన షెడ్ల తొలగింపు

బెల్లంపల్లి, మార్చి 19: పట్టణంలోని వ్యాపారాల సముదాయాల ముందు నాలాపై అక్రమంగా ఏర్పాటు చేసిన షెడ్లను మంగళవారం మున్సిపల్ కమిషనర్ మల్లారెడ్డి ఆధ్వర్యంలో ఎక్స్‌కావేటర్‌తో సిబ్బంది తొలగించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నాలాను ఆక్రమించడం వల్ల వర్షాకాలంలో మురుగు నీరు రోడ్డుపైకి వస్తుందరన్నారు. రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతుండడంతో షెడ్లను తొలగిస్తున్నామన్నారు. త్వరలో నాలాలు ఆక్రమించి నిర్మించిన షెడ్లను తొలగిస్తామని, వ్యాపారులు సహకరించాలని కోరారు.

నగదు పట్టివేత

కాసిపేట, మార్చి 19: ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ. 2.70 లక్షల నగదును మంగళవారం పట్టుకున్నట్లు మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సోమగూడెం చొప్పరిపల్లె వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులో తనిఖీలు చేస్తుండగా ఇప్పనపల్లి శ్రీధర్ బైక్‌ను ఆపి తనిఖీ చేయగా రూ. 1.50 లక్షలు పట్టుబడ్డాయని చెప్పారు. నగదుకు సంబంధించిన ఎలాంటి ఆధారాలు చూపెట్టకపోవడంతో సీజ్ చేశామని తెలిపారు. అలాగే చౌదరి సోమయ్య అనే వ్యక్తి బైక్‌ను తనిఖీ చేయగా ఇతని వద్ద రూ. 1.20 లక్షల నగదు దొరికిందన్నారు. ఆధారాలు లేకపోవడంతో ఎస్ఎస్‌టీ సిబ్బందితో కలిసి సీజ్ చేశామని తెలిపారు. తనిఖీలో ఎస్సై ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

బెల్లంపల్లి, మార్చి 19: బెల్లంపల్లి పట్టణంలో మంగళవారం పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహించారు. కార్లు, ఇతర వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ సయ్యద్ అబ్దులొద్దీన్ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున రూ. 50 వేల కంటే ఎక్కువ నగదును సరైన ఆధారాలు లేకుండా తరలిస్తే సీజ్ చేస్తామని తెలిపారు.

'అరణ్య' రోదన



"మానవుడి మనుగడకు చెట్లే ప్రధానమని, ప్రతి ఒక్కరూ విరివిరిగా మొక్కలు నాటి సంరక్షించాలని పర్యావరణవేత్తలు ఓ వైపు చెబుతున్నారు. మరో వైపు అక్కమార్కులు చెట్లను యథేచ్ఛగా నరుకుతూ అన్యా క్రాంతం చేస్తున్నారు."

- యథేచ్ఛగా చెట్ల నరికివేత
- మితిమీరుతున్న అక్రమార్కుల ఆగడాలు
- పచ్చదనాన్ని మటుమాయం చేస్తున్న వైనం
- చోద్యం చూస్తున్న అధికారులు

మంచిర్యాల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఒకప్పటి ఆదిలాబాద్ జిల్లా దట్టమైన అడవులకు పెట్టింది పేరు. కానీ ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. ప్రభుత్వాలు, అటవీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా కలప స్మగ్లర్ల గొడ్డలి వేటుకు అడవులు కరిగిపోతున్నాయి. ఈ క్రమంలో అడవుల రక్షణకు పూనుకున్న బీఆర్ఎస్ ప్రభుత్వం 2019లో ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించింది. అయితే ఆ ఆదేశాలను క్షేత్ర స్థాయిలో సిబ్బంది, అధికారులు అమలు కాకపోవడం, ఆ తరువాత ప్రభుత్వం కూడా ఆ విషయాన్ని సీరియస్‌గా తీసుకోకపోవడంతో అడవులకు రక్షణ లేకుండా పోయింది.

పూర్వ ఆదిలాబాద్ పరిధిలో..

పూర్వ ఆదిలాబాద్ జిల్లా పరిధిలో మొత్తం 7,101.30 చదరపు కిలో మీటర్ల మేర అడవులు విస్తరించి ఉన్నాయి. ప్రస్తుత నాలుగు జిల్లాల పరిధిలో ఆరు అటవీ డివిజన్లు ఉన్నాయి. ఆదిలాబాద్ డివిజన్‌లో 1898.95 చదరపు కిలోమీటర్లు, బెల్లంపల్లి డివిజన్‌లో 1524.39 చ.కి.మీ, జన్నారం డివిజన్‌లో 643.74 చ.కి.మీ, కాగజ్‌నగర్ డివిజన్‌లో 893.29, మంచిర్యాల డివిజన్‌లో 1115.37, నిర్మల్ డివిజన్‌లో 1025.16 చదరపు కిలోమీటర్లలో అడవులు విస్తరించి ఉన్నాయి. అయితే ఈ లెక్కలు వాస్తవ పరిస్థితికి భిన్నంగా ఉన్నాయి. ఎక్కడికక్కడే చెట్లను నరికి వేస్తుండటంతో అడవులు పలుచబడి పోతున్నాయి.

భీమారం మండలం పోతన్‌పల్లిలో..

మంచిర్యాల అటవీ డివిజన్ పరిధిలోని భీమారం మండలం పోతన్‌పల్లి అడవిలో గుర్తు తెలియని వ్యక్తులు ఇటీవల పెద్ద ఎత్తున చెట్లను నరికి వేశారు. మంచిర్యాల-చెన్నూరు జాతీయ రహదారికి సమీపంలో ఎర్రచెరువు పక్కన వివిధ రకాల 30 చెట్లను రాత్రికి రాత్రే యంత్రాలు ఉపయోగించి నరికి వేసినా సంబంధిత అధికారుల్లో చలనం లేకపోవడం గమనార్హం. పైగా చెట్లు నరికిన ప్రాంతంలో అటవీశాఖ బేస్ క్యాంప్ ఉండడం కొసమెరుపు. నిత్యం అటవీ అధికారులు క్షేత్ర స్థాయిలో గస్తీ ఉండే ప్రాంతంలోనే ఘటన జరగడం శోచనీయం. గతంలో కూడా ఇదే ప్రాంతంలో పెద్ద మొత్తంలో చెట్లను నేల కూల్చ గా, పోడు వ్యవ సాయం చేయడం కోసమే వన మేధానికి పాల్పడ్డట్లు ప్రచారం జరిగింది. తిరిగి అదే ప్రాంతంలో చెట్లు నరికివేతకు గురి కావడం అధికారుల నిర్లక్ష్యాన్ని తెలియజేస్తోంది. ఘటన జరిగి దాదాపు వారం రోజులు కావస్తుండగా, ఇప్పటి వరకు నిందితులను అటవీ అధికారులు పట్టుకోలే కపోవడం కొసమెరుపు.

అధికారుల నిర్లక్ష్యం వల్లే..

అటవీశాఖ అధికారుల పనితీరు కారణంగానే యథేచ్ఛగా అడవులు నరికివేతకు గురవుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అటవీ శాఖ బీట్ అధికారులు, సెక్షన్ ఆఫీసర్లు నిత్యం అడవుల్లో తిరగాల్సి ఉండగా కొందరు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నట్లు తెలుస్తోంది. అడవుల్లో సంచరిస్తే అక్రమసాగు, సరిహద్దుల తొలగింపు తదితర సంఘటనలు దృష్టికి వచ్చి వాటిని సరిచేసే అవకాశం ఉంది. అంతేకాకుండా అడవుల్లో వన్యప్రాణుల కోసం వేటగాళ్లు అమర్చే ఉచ్చులు, విద్యుత్ తీగలను గమనించే అవకాశాలు కూడా ఉంటాయి. చిరుతలు, పులుల పేడ, అడుగులను గుర్తించడం ద్వారా వాటి సంచారాన్ని తెలుసుకొనే అవకాశం ఉంది. తద్వారా వాటి రక్షణ కోసం చర్యలు చేపట్టే వీలుటుంది. సిబ్బంది అడవుల్లోకి రానికారణంగానే స్మగ్లర్లు విజృంభిస్తున్నట్లు ఆరోపణలున్నాయి.

కార్యాచరణ శూన్యం..

అడవుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు గత ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించినా కార్యాచరణ కరువైంది. 'జంగల్ బచావో...జంగల్ బడావో' పేరిట అడ వుల్లో పచ్చదనం పెంచడం, అడవులను రక్షించడం, స్మగ్లర్లను శిక్షిం చడం, తదితర లక్ష్యాలతో ముందుకు పోవాలని కేసీఆర్ అధికారులను ఆదేశించారు. అవసరమైతే ఆ మేరకు కొత్త చట్టాలను రూపొందించాలని హుకుం జారీ చేశారు. అడవుల్లో పచ్చదనం పెంచేందుకు ప్రత్యేకంగా 'గ్రీన్ ఫండ్' ఏర్పాటు చేయడం ద్వారా అవసరమైన నిధులను సేకరించాలని కూడా నిర్ణయించారు. ఇందు కోసం రాష్ట్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించడంతోపాటు అవసరమైతే గ్రీన్ సెస్ వసూలు చేయాలని భావించారు. అయితే గత ప్రభుత్వం నిర్ణయించిన విధంగా కార్యాచరణ చేపట్టకపోవడంతో అడవుల పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న సామెత చందంగా తయారైంది. స్మగ్లర్లపై కఠిన చర్యలు లేకపోవడంతో ఇష్టారీతిన అడవులను నరికివేయడం పరిపాటిగా మారిందనే అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.



భీమారం అడవిలో నరికివేతకు గురైన చెట్లు (ఫైల్)

ఇక్కడి టేకు కలపకు డిమాండ్..

పొరుగు జిల్లాలైన కరీంనగర్, వరంగల్, నిజామాబాద్‌తోపాటు హైద రాబాద్, మహారాష్ట్రలోని పలు నగరాల్లో ఆదిలాబాద్ టేకు కలపకు మంచి డిమాండ్ ఉంది. దీంతో ఇక్కడి కర్రను స్మగ్లర్లు అక్ర మ రవాణా చేస్తున్నారు. కొందరు అధికారుల సహకారంతోనే కలప ఎల్లలు దాటుతుందనే ప్రచారం జోరుగా సాగుతోంది. మంచిర్యాల జిల్లాలో లక్షా 76వేల హెక్టార్లలో అడవులు విస్తరించి ఉన్నాయి. అటవీ అధికారులు వీటిని 195 బీట్లుగా విభజించి సంరక్షిస్తున్నారు. ఇందు కోసం ఏటా కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నారు. అయితే ఎన్ని చర్యలు తీసుకున్నా కలప స్మగ్లర్ల ఆగడాలకు అడ్డుకట్టపడటం లేదు.

ప్రతీ వాహనం తనిఖీ చేయాలి

- జిల్లా ఎన్నికల అధికారి బదావత్ సంతోష్



చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీని పరిశీలిస్తున్న బదావత్ సంతోష్

తాండూర్, మార్చి 19: చెక్‌పోస్టు వద్ద ప్రతీ వాహనాన్ని తనిఖీ చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. మండలంలోని రేపల్లెవాడ గ్రామ సమీపంలో ఏర్పాటు చేసిన జిల్లా సరిహద్దు చెక్‌పోస్టును మంగళవారం కలెక్టర్ బదావత్ సంతోష్, అదనపు కలెక్టర్ రాహుల్ వేర్వేరుగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చెక్‌పోస్టు వద్ద గల రిజిస్టర్లను తనిఖీ చేశారు. చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీని పరిశీలించారు. చెక్‌పోస్టు వద్ద విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి సంబంధించిన సౌకర్యాలు తాగునీరు, రాత్రి సమయంలో విద్యుత్ సౌకర్యం గురించి చెక్‌పోస్టు డీటీ పోచయ్యను అడిగారు. అలాంటి సౌకర్యాలు లేవని చెప్పడంతో వెంటనే సౌక ర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. తనిఖీలు ప్రారంభమైనప్పటి నుంచి ఏమైనా కేసులు నమోదయ్యాయా అని అడగగా ఎలాంటి కేసులు నమోదు కాలేదని చెక్‌పోస్టు డీటీ తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా ఆపి తనిఖీలు చేయాలని సూచిం చారు. అనంతరం తాండూర్‌లోని ఉన్నత పాఠశాల పదవ తరగతి పరీక్ష కేం ద్రానికి వెళ్లి పరీక్షలను పరిశీలించారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాల న్నారు. అనంతరం తాండూర్ శాఖ గ్రంథాలయాన్ని తనిఖీ చేశారు. కార్యక్ర మంలో తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్, ఎంపీడీవో శ్రీనివాస్, డిప్యూటి తహసీల్దార్ ప్రసాద్, ఆర్ఐ అంజన్‌కుమార్ పాల్గొన్నారు.

సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

దండేపల్లి, మార్చి 19: మంచిర్యాల జిల్లా సరిహద్దు దండేపల్లి మండలం గూడెం చెక్‌పోస్టు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మంచిర్యాల ఏసీపీ ప్రకాష్ సూచించారు. గూడెం చెక్‌పోస్టును మంగళవారం సాయంత్రం లక్సెట్టిపేట సీఐ అల్లం నరేందర్, లక్సెట్టిపేట ఎస్సై చంద్రకుమార్‌తో కలిసి ఏసీపీ సందర్శించారు. వాహనాల తనిఖీ తీరును పరిశీలించారు. పార్లమెంట్ ఎన్నికలు ఉన్నందున ఎలక్షన్ కమిషన్ విధించిన నిబంధనలు పాటించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించి ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు సహకరించాలని తెలిపారు.

ఎంసీసీ అమలుపై అధికారుల సమావేశం

నస్పూర్, మార్చి 19: లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ నేపథ్యంలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్(ఎంసీసీ) అమలుపై నస్పూర్ మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం అధికారులు సమా వేశమయ్యారు. నస్పూర్ మున్సిపల్ కమిషనర్ చిట్యాల సతీష్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎస్సై రవికుమార్ ఎంసీసీ అమలుపై చర్చించారు. పట్టణంలో కోడ్ ఉల్లంఘించే వారిపై చర్యలుంటాయని చెప్పారు. రాజకీయ నాయకులు ఎలాంటి ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేయకూడదన్నారు. ప్రజలు రశీదు లేకుండా రూ.50 వేలకు మించి తీసుకెళ్లకూడదని వారు సూచించారు. ఓటు హక్కు వినియోగంపై అవగాహన సదస్సులు నిర్వహించాలని నిర్ణ యించారు. ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌కు విద్యార్థుల ఎంపిక

మంచిర్యాల కలెక్టరేట్, మార్చి 19: హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో 2024-25 విద్యాసం వత్సరానికి గాను జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ ద్వారా ఒకటో తరగతిలో ప్రవేశానికి అర్హత గల విద్యార్థులను ఎంపిక చేశామని అదనపు కలెక్టర్ మోతిలాల్ తెలిపారు. మంగళవారం అదనపు కలెక్టర్ చాంబర్‌లో జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి గంగారాంతో కలిసి డ్రా పద్ధతిన విద్యార్థులను ఎంపిక చేశారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఐదుగురు విద్యార్థులను లక్కీడ్రా ద్వారా ఎంపిక చేశామవని చెప్పారు. ఎంపికైన వారిలో గోండు/నాయకపోడ్‌కు చెందిన ఇద్దరు, లంబాడా, కొలాం , ఇతర ఉప గిరిజనులలో ఒకరి చొప్పున ఉన్నారని తెలిపారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకా

హాజీపూర్, మార్చి 19: మండల కేంద్రంలో మంగళవారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకా వేసినట్లు పశువైద్యురాలు శాంతిరేఖ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 156 ఆవు జాతి, 174 గేదె జాతి పశువులకు టీకాలను వేసినట్లు తెలిపారు. మండలంలో రోజుకు ఒక గ్రామంలో పశువులకు ఉచితంగా టీకా వేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రైతులు పశువులకు టీకాలు వేయిస్తే వచ్చే వర్షాకాలంలో ఎలాంటి వ్యాధుల బారిన పడవని తెలిపారు. పోషకులు టీకా తప్పనిసరిగా వేయించాలని సూచించారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది అగ్నివేష్, నారాయణ, సికిందర్ తదితరులు పాల్గొన్నారు.

రేపు మేకల సంత వేలం

హాజీపూర్, మార్చి 19: వేంపల్లి గ్రామ పరిధిలో రోజువారీ నిర్వహించే మేకల సంతకు గురువారం గ్రామపంచాయతీ కార్యాలయంలో వేలం పాట నిర్వహించనున్నామని స్పెషల్ ఆఫీసర్ గంద్ర హరిత, పంచాయతీ కార్యదర్శి ప్రతిభ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు వేలం పాటలో పాల్గొనవచ్చని తెలిపారు. వివరాలకు గ్రామ పంచాయతీ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

మహనీయుల ఆశయాలను తాకట్టు పెట్టొద్దు



మాట్లాడుతున్న పీవోడబ్ల్యూ జిల్లా నాయకురాలు మద్దెల భవానీ

చెన్నూరు, మార్చి 19: ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మహనీయుల ఆశయాలను తాకట్టు పెట్టవద్దని పీవోడబ్ల్యూ జిల్లా నాయకురాలు మద్దెల భవానీ హెచ్చరించారు. చెన్నూరులో మంగళవారం ఆమె మాట్లాడుతూ బహుజన వాదం ఎత్తుకుని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజలను నమ్మించి గొంతు కోసే విధంగా బీఆర్ఎస్ పార్టీలో చేరిన ప్రవీణ్‌కుమార్ ప్రజలను మోసం చేశారన్నారు. బీఆర్ఎస్ పార్టీలో చేరి మహనీయుల ఆశయాలను తాకట్టు పెట్టిన ప్రవీణ్‌కుమార్‌ను ప్రజలు నమ్మవద్దన్నారు. మొన్నటి వరకు దొరల పాలన, కుటుంబ పాలన అని బీఆర్ఎస్‌ను వ్యతిరేకించిన ప్రవీణ్‌కుమార్ ఇప్పుడు అదే పార్టీలో చేరడం సిగ్గు చేటన్నారు. అలాగే 2019లో అధికారంలోకి వస్తే వంద రోజుల్లో వర్గీకరణ చేస్తామని చెప్పిన మోడీ ప్రభుత్వానికి ఇంకా వంద రోజులు కావడం లేదా అని ప్రశ్నించారు. దళిత బహుజనులను అడ్డం పెట్టుకుని రాజకీయాలను చేసే వారిని ఎవరు నమ్మవద్దని కోరారు. సమావేశంలో శిరీష, ప్రవళిక, పద్మ, శ్రీలత, వసంత, రమేశ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అధికారుల సస్పెన్షన్ ఉత్తర్వులు రద్దు చేయాలి



జీఎంకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మందమర్రిటౌన్, మార్చి 19: మందమర్రి ఏరియా స్టోర్‌లో ఇటీవల జరిగిన ప్రమాదంలో కాసిపేట 2 గనికి చెందిన కర్రె రాజు జనరల్ మజ్దూర్ అనే కార్మికుడు మృతిచెందిన ఘటనలో ఇద్దరు అధికారులను సస్పెండ్ చేశారని, దీన్ని రద్దుచేయాలని మంగళవారం మందమర్రి జీఎం మనోహర్‌కు అధికారుల సంఘం నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అధికారుల సంఘం అధ్యక్షుడు రమేశ్ మాట్లాడుతూ కార్మికుడు రాజు మృతి చెందడం బాధకరమని చెప్పారు. ఈ ఘటనకు అధికారులను బాధ్యులను చేసి సస్పెండ్ చేయడం భావ్యం కాదని తెలిపారు. ఈ ప్రమాదంపై డీఎంఎస్ అధికారుల విచారణ కొనసాగుతున్నందున వాస్తవాలు బయటకు రానప్పుడు అధికారులను సింగరేణి యాజమాన్యం సస్పెండ్ చేయడం సరైంది కాదన్నారు. విచారణలో అధికారుల పాత్ర ఉందని తేలితే చర్యలు తీసుకోవాలన్నారు. కానీ ఏమి లేనప్పుడు ఇలాంటి చర్యలు పారిశ్రామిక సంబంధాలను దెబ్బతీస్తాయన్నారు. అన్ని ఏరియాల్లో వినతి పత్రాలు సమర్పిస్తున్నామని, వెంటనే అధికారుల సస్పెన్షన్ రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం రాజేశ్వర్‌రెడ్డి, ఐఈడీ డీజీఎం రాజన్న, కేకే ఓసీపీ ప్రాజెక్టు అధికారి రమేశ్, శాంతిఖని ఏజెంటు విజయ్ ప్రసాద్, సంఘం సెక్రటరీ పైడీశ్వర్, సభ్యులు పాల్గొన్నారు.

శ్రీరాంపూర్: మందమర్రి ఏరియా స్టోర్స్‌లో జరిగిన ఘటనలో స్టోర్స్ ఈఈ జె. శశిధర్‌పై జారీ చేసిన సస్పెన్షన్ ఉత్తర్వులను ఎత్తివేయాలని అధికారుల సంఘం శ్రీరాంపూర్ ఏరియా అధ్యక్షుడు కె. వెంకటేశ్వర్ రెడ్డి, తదితరులు సీఎండీ ఎన్ బలరాం నాయక్‌కు లేఖ రాశారు. ఈ మేరకు లేఖను స్థానిక జీఎం బి సంజీవరెడ్డికి మంగళవారం అందించి సీఎండీకి పంపాలని కోరారు. కార్యక్రమంలో అధికారుల సంఘం కార్యదర్శి చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు మహేష్, కిరణ్ కుమార్, సంయుక్త కార్యదర్శులు గౌస్‌పాషా, భీమన్న, కోశాధికారి రాము, సంయుక్త కోశాధికారి కోటేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.



పార్లమెంట్ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి

చెన్నూరు, మార్చి 19: పార్లమెంట్ ఎన్నికలను మే 13న పకడ్బందీగా నిర్వహించేందుకు కృషి చేయాలని చెన్నూరు అసెంబ్లీనియోజకవర్గ రిటర్నింగ్ అధికారి చంద్రకళ కోరారు. మంగళవారం రాత్రి తహసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గ సెక్టోరల్ అధికారులకు ఏర్పాటు చేసిన శిక్షణ తరగతుల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. ఎన్నికల నిబంధనల ప్రకారం ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రభుత్వ కార్యాలయాలు, కూడళ్లలో ఉన్న అన్ని రాజకీయ పార్టీల పోస్టర్లు,వాల్ రైటింగ్స్ తొలగించాలన్నారు. నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాల ఏర్పా టు వాటి నిర్వహణ తదితర అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, చెన్నూరు, కోటపల్లి , భీమారం, జైపూర్ ,మందమర్రి మండలాల తహసీల్దార్‌లు , చెన్నూరు, మందమర్రి, క్యాత నపల్లి మున్సిపల్ కమిషనర్‌లు , సెక్టోరల్ అధికారులు పాల్గొన్నారు.

పాఠశాల ఎదుట విద్యార్థుల ఆందోళన

మందమర్రిటౌన్, మార్చి 19: పట్టణంలోని లిటిల్‌ఫ్లవర్ పాఠశాల ఎదుట మంగళవారం మంచిర్యాలకు చెందిన వివేకానంద కాలేజీ ఆఫ్ పాలిటెక్నిక్ విద్యార్థులు ధర్నా నిర్వహించారు. విద్యార్థులు మాట్లాడుతూ పాఠశాల యాజమాన్యం మంచిర్యాలలో పాలిటెక్నిక్ కళాశాల నెలకొల్పిందని, మూడు నెలల నుంచి ఎలాంటి బోధన చేయకుండా మూసివేసిందని మండిపడ్డారు. పరీక్షల సమయంలో కాలేజీమూసివేస్తే తమ పరిస్థితి ఏంటని మండిపడ్డారు. కళాశాల తెరిచి తమకు న్యాయం చేయాలని కోరారు. తమకు న్యాయం చేయకపోతే జిల్లా వ్యాప్తంగా నిరసనలు చేపడతామని వారు హెచ్చరించారు.

అక్రమ దందాలపై ఉక్కుపాదమే

- రామగుండం పోలీస్ కమిషనర్ ఐజీ శ్రీనివాస్

కోల్‌సిటీ, మార్చి 19: రామగుండం కమిషనరేట్‌లో అక్రమ దందాలపై ఉక్కుపాదం మోపుతున్నామని, కొన్ని రోజులుగా వరుస దాడులు నిర్వహిస్తున్నట్టు రామగుండం పోలీస్ కమిషనర్ ఐజీ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం కమిషరేట్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రేషన్ బియ్యం, ఇసుక అక్రమ రవాణాను కట్టడి చేస్తున్నామని, ఎన్నికల నేపథ్యంలో అక్రమ మద్యం అమ్మకాలపై దృష్టి పెట్టామని, ఇప్పటికే ఆరు కేసులు నమోదు చేశామన్నారు. ఆయిల్ డిపోల నుంచి అక్రమంగా డీజిల్ దొంగలించిన కేసు దర్యాప్తు జరుగుతుందని, బాధ్యులెవరూ ఉపేక్షించేది లేదన్నారు. ప్రభుత్వం వద్ద ధాన్యం తీసుకుని సీఎంఆర్ ఇవ్వకుండా రూ.7కోట్ల ప్రభుత్వ ధనాన్ని కాజేసిన కేసు రెండు రైస్ మిల్లులపై కేసులు నమోదు చేశామన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో అంతర్ రాష్ట్ర, అంతర్ జిల్లాల సరిహద్దులో చెక్ పోస్టులు ఏర్పాటు చేశామని, ప్రత్యేక బృందాలను కూడా నియమించామన్నారు. రూ.50వేలకు మించి నగదును వెంట తీసుకెళ్లరాదన్నారు. పెళ్లిళ్ల వంటి శుభకార్యాలకు నగదు తీసుకెళితే డబ్బు ఎవరి వద్ద సేకరించారనే విషయంపై రశీదులు ఉండాలన్నారు. రూ.50వేల నుంచి రూ. 10లక్షల వరకు నగదు లభిస్తే ఆదాయ పన్ను శాఖకు అందిస్తామని తెలిపారు.

నేడు నీటి సరఫరాలో అంతరాయం

ఏసీసీ, మార్చి 19: మంచిర్యాల పట్టణంలోని మంచినీటి సరఫరా పైపుల మరమ్మతులు చేపట్టనున్నందున పట్టణంలోని 36 వార్డుల్లో బుధవారం మంచినీటి సరఫరా నిలిపివేయడం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలందరు సహకరించాలని కోరారు.


దరఖాస్తులు చేసుకోవాలి

ఏసీసీ, మార్చి 19: తెలంగాణ సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 2024-25 విద్యా సంవత్సరానికి గాను 6,7,8,9 తరగతుల్లో మిగిలి ఉన్న సీట్ల భర్తీ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ఆర్‌సీవో స్వరూపరాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కోర్టును సందర్శించిన విద్యార్థులు

బెల్లంపల్లి, మార్చి 19: బెల్లంపల్లిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆర్ట్స్ విద్యార్థులు మంగళవారం బెల్లంపల్లి జూనియర్ సివిల్ జడ్జి కోర్టును సందర్శించారు. జడ్జి ముఖేష్ కోర్టు నిర్వహణ,న్యాయ సబంధిత విషయాల గురించి సిబ్బంది ద్వారా అవగాహన కల్పిం చారు. విద్యార్థులకు ఉపయోగపడే ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని చేపడతామని ప్రిన్సిపాల్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు సమ్మక్క పాల్గొన్నారు.















ప్రాచీన సనాతన ధర్మాన్ని పరిరక్షించుకోవాలి

- శృంగేరి శివగంగ పీఠాధిపతి పురుషోత్తమ భారతీ మహాస్వామి



ఉత్సవమూర్తులకు శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

నెన్నెల, మార్చి 19: విశిష్టమైన ప్రాచీన సనాతన ధర్మాన్ని పరిరక్షించుకోవాలని శృంగేరి శివగంగ పీఠాధిపతి పురుషోత్తమ భారతీమహాస్వామి అన్నారు. మండల కేంద్రంలో పునర్నిర్మించిన పురాతన గంగాధర దేవాలయంలో శివ పంచాయతన నవగ్రహ శిఖర, యంత్ర మూర్తి స్థిర ప్రతిష్ఠాపన మహోత్సవంలో మంగళవారం పాల్గొని భక్తులనుద్దేశించి ప్రవచించారు. భక్తి మార్గమే ముక్తిమార్గమని, సన్మార్గంలో ప్రయాణిస్తే ఎలాంటి కష్టాలనైన ఎదుర్కొనే శక్తిని దేవుడు ప్రసాదిస్తాడని అన్నారు. ప్రతి ఒక్కరూ ధర్మరక్షణకు కట్టుబడి ఉండాలని సూచించారు. స్వధర్మాన్ని మించిన దైవం లేదన్నారు. వేదాలు, పురాణాలు, ఇతిహాసాలు భారతీయ ఆత్మగా అభివర్ణించారు. అంతకంటే ముందుగా స్వామివారికి భక్తులు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. పునర్నిర్మించిన గంగాధర ఆలయం గొప్పగా, మహాద్భుతంగా రూపుదిద్దుకున్నదని స్వామీజీ ఆనందం వ్యక్తం చేశారు. దేవతామూర్తులకు స్వామీజీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రహ్మశ్రీ గట్టు నరహరి శర్మ అవధాని ఆధ్వర్యంలో నిత్యపూజాభి షేకార్చన, జపపారాయణ, గణపతి హోమము, నవగ్రహ, వాస్తు, యోగినీ, క్షేత్రపాలన, దేవతాస్థాపన హోమాదులు నిర్వహించారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

వేమనపల్లి, మార్చి 19: మండలంలోని నీల్వాయి, ముల్కలపేట, కేతనపల్లి, మామడ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను మంగళవారం తహసీల్దార్ రమేశ్ పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో తగిన సౌకర్యాలను కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, ర్యాంపు, నీడ తదితర సౌకర్యాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఆయన వెంట ఆర్ఐ లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

- 10 మంది అరెస్టు, రూ. 14.48 లక్షలు స్వాధీనం



మాట్లాడుతున్న రామగుండం సీపీ శ్రీనివాస్, (ఇన్‌సెట్‌లో స్వాధీనం చేసుకున్న డబ్బులు)

చెన్నూరు, మార్చి 19: చెన్నూరు మండలం నాగాపురం గ్రామ శివారులోని పేకాట స్థావరంపై సోమవారం రామగుండం టాస్క్‌ఫోర్స్ పోలీసులు మెరుపు దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న పది మంది జూదరులను పట్టుకుని వారి వద్ద నుంచి రూ. 14.48 లక్షలు, 10 సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నట్లు రామగుండం సీపీ శ్రీనివాస్ వెల్లడించారు. రామగుండం టాస్క్‌ఫోర్స్ సీఐ సంజయ్, ఎస్సై ఉపేందర్‌ల ఆధ్వర్యంలో నాగాపురం, ఆస్నాద గ్రామాల శివారుల్లోని మామిడి తోటలో పేకాట ఆడుతున్నారనే పక్కా సమాచారంమేరకు పేకాట స్థావరంపై దాడి చేసి వారి వద్ద నుంచి సెల్‌ఫోన్‌లు, పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. నాగాపురం గ్రామానికి చెందిన అన్నాల తిరుపతి, సందెల తిరుపతి, వరంగల్‌కు చెందిన చోటుతో పాటు కొంత మంది ఒక ముఠాగా ఏర్పడి ఈ ప్రాంతంలో పేకాట స్థావరాలు ఏర్పాటు చేసి పేకాట ఆడిస్తున్నట్లు తెలిపారు. పెద్దపల్లి, మంచిర్యాల, వరంగల్, కరీంనగర్, ఆసిఫాబాద్, గోదావరిఖని తదితర ప్రాంతాల నుంచి పేకాట రాయుళ్లను పిలిపించి స్థావరాల వద్ద పేకాట రాయుళ్లకు అన్ని సదుపాయాలు కల్పిస్తూ వారి వద్ద నుంచి కమీషన్లు వసూలు చేస్తున్నారన్నారు. పేకాట ఆడే ప్రదేశంలో చుట్టు పక్కల రహస్యంగా కొంత మంది వ్యక్తులను సెంట్రీగా నియమిస్తున్నారన్నారు. అటు వైపు పోలీసులు కానీ, వేరే ఎవరైనా వస్తే వెంటనే సెల్‌ఫోన్‌ల ద్వారా వారికి సమాచారం అంది స్తారని తెలిపారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించాలమని తెలిపారు. పేకాట ఆడుతున్న సమాచారం తెలిస్తే పోలీసులకు తెలయజేయాలని కోరారు.

పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



చిన్నారులకు అక్షరభ్యాసం చేయిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి

దండేపల్లి, మార్చి 19: పిల్లల ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులు, అంగన్‌వాడీ టిచర్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని దండేపల్లి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి సూచించారు. దండేపల్లి మండలం వందూర్‌గూడ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పోషణ్ పక్వాడ్ పక్షం కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అన్నప్రాసన, అక్షరభ్యాసం చేయించారు. చిన్నారుల బరువు, వారికిచ్చే పోషకారాలను పరిశీలించారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు, పిల్లల తల్లిదండ్రులచేత ప్రతిజ్ఞ చేయించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోషకారం తీసుకోవడం వల్ల గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు సుజాత, విజయలక్ష్మి, గర్భిణులు, బాలింతలు, బాలికలు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కన్నెపల్లి: మండలంలోని దాంపూర్ గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్వాడా కార్యక్రమంలో బాగంగా మంగళవారం గర్భిణులకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఇందిర ఆధ్వర్యంలో సీమంతం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్ వైజర్ గర్భిణులు తీసుకో వాల్సిన పోషకాహారం, తృణధాన్యాలు, ఆరోగ్య సూత్రాలను వివరించారు. కార్యక్రమంలో అంగ న్‌వాడీ టీచర్లు సునీత, సరోజ, ఆశా కార్యకర్త, ఆయాలు, తల్లులు పాల్గొన్నారు.

కాసిపేట: మండలంలోని బుగ్గగూడెం, లంబాడితండాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ పక్వాడా కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్ రాధిక గర్భిణీలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పౌష్టికాహారం, ముర్రుపాల ప్రాముఖ్యత గురించి వివరించారు. అనంతరం పోషణ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సుజాత, రాజమణి, తల్లులు తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

- కలెక్టర్ బదావత్ సంతోష్

మంచిర్యాల కలెక్టరేట్, మార్చి 19: జిల్లాలో పదో తరగతి వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కృష్ణవేణి టాలెంట్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రెగ్యులర్ విద్యార్థుల కొరకు 51 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు. సెకండ్ లాంగ్వేజ్ పరీక్షకు 9,294 మంది రెగ్యులర్ విద్యార్థులకు గాను పరీక్షకు 9,273 మంది హాజరైనట్లు తెలిపారు. పోలీసు శాఖ ఆధ్వర్యంల పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయడంతో పాటు జిరాక్స్ సెంటర్లను మూసి వేయించామని చెప్పారు. పరీక్షల్లో మాస్ కాపీయింగ్ జరగకుండా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. సిబ్బంది తగిన చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు.

ఏసీసీ: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మంగళవారం మంచిర్యాల జిల్లాలో సజావుగా జరిగింది. డీఈవో యాదయ్య చెన్నూరు పట్టణంలోని 2 పరీక్ష కేంద్రాలను, జైపూర్ మండలంలోని 3 పరీక్ష కేంద్రాలను, భీమారంలో ఒక పరీక్ష కేంద్రాన్ని సందర్శించి పరీక్షను పరిశీలించారు. అసిస్టెంట్ కమిషనర్ ఫర్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్ 2 పరీక్ష కేంద్రాలను,ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు 18 కేంద్రాలను సందర్శించాయి.

కాసిపేట: పదో తరగతి పరీక్షలు రెండవ రోజు మంగళవారం ప్రశాంతంగా జరిగాయి. దేవాపూర్ డీఏవీ పాఠశాల కేంద్రంలో 124 మంది , మల్కేపల్లి ఆశ్రమ పాఠశాల కేంద్రం లో 74 మంది, తెలంగాణ మోడల్ స్కూల్‌లో 176 మంది పరీక్షలకు హాజరయ్యారు. ఏ సెంటర్‌లో కూడా గైర్హాజరు లేదు. ఫ్లైయింగ్ స్క్వాడ్ సిబ్బంది పరీక్ష కేంద్రాలను పరిశీలించారు.

జన్నారం: మండలంలో రెండో రోజూ పదో ప్రశాంతంగా జరిగాయి. మొత్తం 616 మంది విద్యార్థులకు 615 మంది పరీక్షలకు హాజరైనట్లు అధికారులు తెలిపారు. పరీక్షా కేంద్రాల పరిధిలో 144 సెక్షన్ అమలు చేశారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు.

ఇంటి పన్ను సకాలంలో చెల్లించాలి



ఇంటి పన్ను వసూలు చేస్తున్న కమిషనర్ సతీష్

నస్పూర్, మార్చి 19: మున్సిపాలిటీలో బకాయి ఉన్న ఇళ్ల యజమానులు వెంటనే చెల్లించి అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ చిట్యాల సతీష్ కోరారు. మున్సిపాలిటీలోని 15 నుంచి 20వార్డుల్లో కొనసాగుతున్న ఇంటి పన్ను వసూలు ప్రక్రియను మంగళవారం పరిశీలించారు. పన్నులను వసూలు చేయాలని, ఇంటి యజమానులు కూడా సకాలంలో చెల్లించాలన్నారు. 2022-23 వరకు అస్తి పన్ను బకాయిలపై 90 శాతం వడ్డీ మాఫీ ప్రకటించిందని చెప్పారు. 2023-24 గల దానికి 10 శాతం వడ్డీతో కలిపి బాకాయిలను చెల్లించాలన్నారు. మార్చి 31తో వడ్డీ మాఫీ అవకాశం ముగుస్తుందన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారి సతీష్, బిల్లు కలెక్టర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో జాజిరి సందడి



దండేపల్లిలో జాజిరి ఆడుతున్న చిన్నారులు

దండేపలి, మార్చి 19: గ్రామాల్లో పిల్లలంతా సంతోషంగా ఆడుకునే జాజిరి ఆటలు ప్రారంభమయ్యాయి. హోలీ పండుగకు ముందు పది రోజుల పాటు గ్రామాల్లో జాజిరి ఆట ఆడుకుంటారు. పిల్లలంతా కోలలను లయబద్ధంగా కొడుతూ జాజిరి పాటలు పాడుతూ ఉత్సాహం కనబరుస్తున్నారు. సాయంత్రం నుంచి పొద్దు పోయే వరకు అన్ని ఇళ్లు తిరుగుతూ వారు ఇచ్చే ధాన్యం, డబ్బులు తీసుకుంటారు. పది రోజుల పాటు ఆడిన తర్వాత అమావాస్య నాడు కోలలను ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసే కామదహనంలో వేసి దహనం చేస్తారు. అనంతరం జాజిరి ఆడుకోగా వచ్చిన ధాన్యం, బియ్యం, డబ్బులను సమానంగా పంచుకుంటారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



గర్భిణులకు శ్రీమంతం చేస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

బెజ్జూరు, మార్చి 19: గర్భిణులు, బాలింతలు పోషక ఆహారం తీసుకున్నప్పుడే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని సీడీపీవో విజయలక్ష్మి అన్నారు. మంగళవారం పోషణ పక్షోత్సవాల్లో భాగంగా మండలంలోని సోమిని, మొగవెల్లి, ఇప్పలగూడ గ్రామాల్లో చిరుధాన్యాలపై అవ గాహన కల్పించారు. గర్భిణులు, బాలింతలు పోషక విలువలతోకూడిన ఆహారంతోపాటు ఆకుకూరలు అధికంగా తీసుకున్నప్పుడే పుట్టబోయే బిడ్డ, బాలింతలు, గర్భిణులు ఆరోగ్యంగా ఉంటారని రక్తహీనత తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కరుణ, గ్రామస్థులు పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీనివాస్

వాంకిడి, మార్చి 19: మహారాష్ట్ర నుంచి ఆర్టీసీ బస్సులో గంజాయి తరలిస్తున్న మంచిర్యాల జిల్లా మందమర్రికి చెందిన కోట మహేష్‌ను మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపిన్నట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం ఉదయం వాంకిడి పోలీసుస్టేషన్‌లో ఎస్సై సాగర్‌తో కలిసి విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మంచిర్యాల జిల్లా మందమర్రికి చెందిన కోట మహేష్ మహారాష్ట్ర చంద్రాపూర్‌కు చెందిన దిలీప్ యాదవ్ వద్ద రూ.10వేలు చెల్లించి కిలో గంజాయి కొనుగోలు చేశాడు. వాంకిడి బస్టాప్ వద్ద రాత్రి బ్యాగు పట్టుకొని అనుమానాస్పదంగా కనిపించడంతో కోట మహేష్‌ను వాంకిడి పోలీసులు తనిఖీచేయగా మహేష్ వద్ద నుంచి కిలో గంజాయి లభించింది. గంజాయిని స్వాధీనపర్చుకొని మహేష్, దిలీప్ యాదవ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి

రెబ్బెన, మార్చి 19: ఎన్‌హెచ్‌ఎం స్కీంలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ తెలిపారు. మంగళవారం పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ సుజీత్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. మూడు నెలల నుంచి కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు చెల్లించటం లేదన్నారు. పీఆర్సీ, ఏరియర్స్ కూడా రావటం లేదన్నారు. ఈ విషయంలో అధికారులు వెంటనే స్పందించాలన్నారు. లేనిపక్షంలో దశలవారి పోరాటం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో 2వ ఎన్ఎంఏ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రమీల, ఎన్‌హెచ్‌ఎం డాక్టర్ సుపిత్ర, సిబ్బంది ఝాన్సీ సరిత, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య

వాంకిడి, మార్చి 19: మండలంలోని ఖమాన గ్రామానికి చెందిన టిప్లే శంకర్(42) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై రాములు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మూడు సంవత్సరాలనుంచి టిప్లేశంకర్ కడుపునొప్పితో బాధపడుతున్నాడు. దీంతో బాధ భరించలేక మద్యంకు అలవాటు పడ్డాడు. ప్రతిసారి కడుపునొప్పి వచ్చినప్పుడల్లా మద్యం తాగుతుండేవాడు. దీంతో అతనిభార్య సునీత కడుపునొప్పి వస్తే ఆసుపత్రికి వెళ్లాలని కానీ ఇలా మద్యం తాగుతుంటే నొప్పి తగ్గదని మందలించింది. సోమవారం రాత్రి మద్యం తాగి ఇంటికి రాగా భార్య సునీత మళ్లీ ఎందుకు మద్యం తాగి వచ్చావని మందరలించింది. దీంతో కోపంతో శంకర్ బయటకు వెళ్లి పోయాడు. రాత్రి పదిదాటినా ఇంటికి రాక పోవడంతో అతని కుమారులు సాయి, శ్రీనివాస్ చుట్టు పక్కల, బంధువుల ఇళ్లలో వెతికినా జాడ కనిపించలేదు. మంగళవారం ఉదయం 6గంటలకు పొలం వద్దకు వెళ్లి చూడగా అక్కడ శంకర్ పురుగుల మందు తాగి చని పోయి ఉన్నాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులకు అక్కడికి చేరుకున్నారు. మృతుడి కుమారుడు సాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

కుష్టు వ్యాధి నివారణకు సహకరించాలి

వాంకిడి, మార్చి 19: కుష్టువ్యాధి నివారణకు ప్రతిఒక్కరు సహకరించాలని ఆరోగ్యశాఖ విస్తర్ణాధికారి రవిదాస్ కోరారు. కుష్టు వ్యాధిని గుర్తించడానికి మండలంలోని ఖమాన, కోమటిగూడ, దుబ్బగూడ, కనర్‌గాం గ్రామాలను మంగళవారం సందర్శించి అవగాహన కల్పించారు. ఈనెల24వరకు కుష్టు వ్యాధిని గుర్తించేందుకు ఇంటింటికి సర్వే జరుపుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్ పి రేణుక, ఏఎన్ఎం సునీత, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

గ్రామాల్లో పశువైద్య శిబిరాలు

కౌటాల, మార్చి 19: మండలంలోని వీరవెల్లి గ్రామంలో పశువైద్యాధికారి శ్రీకాంత్ ఆధ్వర్యంలో మంగళవారం పశు వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పశువులకు ఎఫ్ఎండీ వ్యాక్సినేషన్ చేశారు. రైతులు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.కార్యక్రమంలో సిబ్బంది సందీప్, ప్రకాష్, రాజన్న, భిక్షపతి, శోభన్ పాల్గొన్నారు.

రాబందుల పునరాగమనం

పెంచికలపేట, మార్చి 19: పెంచికలపేట రేంజ్ నందిగామ బీట్ పరిధిలోని పాలరాపుగుట్టకు ఒక ప్రత్యేకత ఉంది. అంతరించిపోతున్న పొడుగుముక్కు రాబందులకు ఈ ప్రాంతం నెలవు. గతంలో 23కుపైగా పొడుగు ముక్కు రాబందులు ఈ ప్రాంతంలో ఆవాసాలు ఏర్పాటు చేసుకుని ఉండేవి. అయితే కొన్ని సంవత్సరాలుగా రాబందులు కానరావడం లేదు. తాజాగా ఈ ప్రాంతంలో మళ్లీ వాటి కదిలికలను అటవీ అధికారులు గుర్తించారు. రెండు పొడుగు ముక్కు రాబందులు ఆకాశంలో విహరిస్తున్న సమయంలో తమ సెల్‌ఫోన్‌లో చిత్రీకరించారు. ఈ మధ్యకాలంలో రాబందులు కనిపిస్తున్నాయని, వాటి మనుగడకు అవసరమైన చర్యలు చేపడుతామని అటవీ అధికారులు చెబుతున్నారు.



పోక్సో కేసులో ఒకరికి జీవితఖైదు

ఆసిఫాబాద్‌రూరల్, మార్చి 19: బాలికను అత్యాచారం చేసిన కేసులో కాగజ్‌నగర్ మండలం భట్టుపెల్లి గ్రామానికిచెందిన ఫైలి రమేష్ కుమార్‌కు జీవిత ఖైదు విధిస్తూ జిల్లా ప్రధానన్యాయమూర్తి ఎంవీ రమేష్ మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తెలిపిన వివరాల ప్రకారం.. భట్టుపెల్లి గ్రామానికి చెందిన రమేష్‌కుమార్ అదే గ్రామానికి చెందిన ఏడేళ్ల బాలికను మే8, 2023న అత్యాచారం చేశాడు. అదేరోజు కుటుంబీకులు కాగజ్‌నగర్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు డీఎస్పీ కరుణాకర్, రూరల్ పోలీసుస్టేషన్ ఎస్సై సోనియా విచారణ జరిపి కోర్టులో ఛార్జీషీటు దాఖలు చేశారు. మంగళవారం 14మంది సాక్షులను విచారించిన న్యాయమూర్తి నిందితుడికి జీవితఖైదుతోపాటు రూ.10వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ జీవీఎస్ ప్రసాద్ వాదించారు. నిందితుడికి శిక్షపడేలా కృషిచేసిన డీఎస్పీ, ఎస్సైలను ఎస్పీ సురేష్‌కుమార్ అభినందించారు.

శనగల కొనుగోలు కేంద్రం ప్రారంభం

జైనూర్, మార్చి 19: మండలకేంద్రంలోని మార్కెట్‌కమిటీ గోదాంలో మంగళవారం మార్క్‌ఫెడ్ డీఎం ప్రవీణ్‌రెడ్డి, సహకారబ్యాంక్ మేనేజర్ సత్య శ్రీవాణి, ఎస్బీఐ మేనేజర్ గోపాల్‌కృష్ణ తదితరులు శనగల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మార్క్‌ఫెడ్ డీఎం ప్రవీణ్ రెడ్డి మాట్లాడుతూ శనగలకు ప్రభుత్వం క్వింటాలుకు రూ.5440 రూపాయలు మద్దతు ధర ప్రకటిం చిందన్నారు. రైతులు ఈ ఆవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అదేవిధంగా రైతులు పట్టా కల్గి ఉండాలని, సంబంధిత వ్యవసాయ అధికారుల రికార్డులో పట్టా ఆన్‌లైన్‌చేసి ఉండాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సహకార చైర్మన్ జనార్దన్, ఆదివాసీ నాయకులు ఉయికచందన్, రైతులు పాల్గొన్నారు.

లోకసభ ఎన్నికలకు కసరత్తు

- ఏర్పాట్లలో అధికారులు బిజీబిజీ
- జిల్లాలో ఏడు చెక్‌పోస్టులు ఏర్పాటు
- జిల్లాలో మొత్తం 4,55,437 మంది ఓటర్లు



సిర్పూర్(టి) మండలం వెంకట్‌రావుపేట వద్ద పట్టుబడ్డ నగదు (ఫైల్)



స్ట్రాంగ్‌రూంను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే (ఫైల్)

ఆసిఫాబాద్‌రూరల్, మార్చి 19: జిల్లాలో లోక్‌సభ ఎన్నికల కసరత్తును అధికార యంత్రాంగం ముమ్మరం చేసింది. ఎన్నికల కోడ్‌ను అమలు చేసేం దుకు ప్రత్యేకబృందాలను ఏర్పాటు చేశారు. అంతర్‌జిల్లా, అంతర్‌రాష్ట్ర సరిహద్దుల వద్ద చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకవర్గాల్లో తొమ్మిది ఎస్ఎస్‌టీ, ఎనిమిది ఫ్లయింగ్ స్క్వాడ్ బృం దాలు, రెండు వీడియోబృందాలు, ఎనిమిది మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ టీంలు, రెండు అకౌంటింగ్ టీంలు మొత్తం 30బృందాలను ఏర్పాటు చేశారు. సీ విజిల్ యాప్ ద్వారా వచ్చే ఫిర్యాదులపై చర్యల కోసం కలెక్టరేట్‌లో ప్రత్యేక గది ఏర్పాటు చేసి సిబ్బందిని నియమించారు.

జిల్లాలో ఏడు చెక్‌పోస్టులు..

పోలీసుల ఆధ్వర్యంలో ఏడు చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. ఓటర్లను ప్రభావితం చేసేం దుకు పార్టీలు, అభ్యర్థులు డబ్బులు, కానుకలు, మద్యం పంపిణీకి ఏర్పాట్లు చేసుకుంటారు. అలాంటి వాటిని అరికట్టి ప్రశాంతంగా ఎన్నికలు జరిపించేలా అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారు. దహెగాం మండలంలోని కల్వడ, కౌటాల మండలంలోని తుమ్మిడిహెట్టి, రెబ్బెన, సిర్పూర్ (టి) మండలంలోని వెంకట్‌రావు పేట, చింతలమానేపల్లి మండలం గూడెం, వాంకిడి మండలాల్లో అంతర్‌రాష్ట్ర చెక్ పోస్టులను ఏర్పాటు చేశారు. ఈ తనిఖీ కేంద్రాల వద్ద పోలీసులతోపాటు ప్రత్యేక బృందాలు విధులు నిర్వహిస్తుంటారు. రూ.50వేలకు మించి నగదు తరలించే సమయంలో సరైన ఆధారాలు చూపించాల్సి ఉంటుంది.లేకుంటే వాటిని సీజ్ చేస్తారు. ఇప్పటివరకు జిల్లాలో రూ.12లక్షల నగదు సీజ్ చేసి తొమ్మిది కేసులు నమోదు చేశారు.

పెరిగిన పోలింగ్ కేంద్రాలు..

జిల్లాలో ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకవర్గాలలో గతంలో 598 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో ఆసిఫాబాద్ నియోజకవర్గంలో 305 పోలింగ్ కేంద్రాలు, సిర్పూర్ నియోజకవర్గంలో 293 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. తాజాగా ఓటర్లకు దూరభారం తగ్గించే ఉద్దేశంతో అధి కారు లు 79అదనపు కేంద్రాల ఏర్పాటుకు ఎన్నికల సంఘానికి ప్రతిపాదనలు ప్రతిపాదించారు. దీంతో జిల్లాలో 677 పోలింగ్‌కేంద్రాలు ఏర్పాటు కానున్నాయి. మే 13న జిల్లాలోని రెండు నియోజకవర్గాలలో పోలింగ్ నిర్వహించనున్నారు.

జిల్లాలో 4,55,437 మంది ఓటర్లు..

జిల్లాలో ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకవర్గాల్లో మొత్తం ఓటర్లు 4,55,437 మంది ఓటర్లు ఉన్నారు. పోలింగ్ మే 13న జరుగనున్న నేపథ్యంలో ఎన్నికల సంఘం ఓటరు నమోదుకు మరో అవకాశం కల్పించింది. ఏప్రిల్ 15వ తేదీ నాటికి 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు నమోదు చేసుకోవచ్చు.

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా కృషి చేయాలి

- ఎస్పీ సురేష్‌కుమార్



మాట్లాడుతున్న ఎస్పీ సురేష్‌కుమార్

ఆసిఫాబాద్, మార్చి 19: జిల్లాపోలీసు అధికారులు, సిబ్బంది రాబోయే పార్లమెంట్ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహిం చేందుకు కృషిచేయాలని ఎస్పీ సురేష్ కుమార్ అన్నారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు అధికారులతో నెలవారి నేర సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల కోడ్ ఉన్నందున ప్రతి ఒక్కరు విధులను నిష్పక్షపాతంగా నిర్వహించాలన్నారు. ఎన్నికలలో ప్రజలను ప్రభావితం చేయడానికి డబ్బు, మద్యం ఇతర సామాగ్రి జిల్లాలోనికి ప్రవేశించ కుండా చెక్‌పోస్టు ద్వారా వివిధ శాఖల సమన్వయంతో సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. స్వేచ్ఛ, నిష్పక్షపాతంగా ఎన్నికలను నిర్వహించడంలో భాగంగా పోలీసుస్టేషన్స్ వారిగా కఠినత్వాన్ని అంచనా వేస్తామన్నారు. దానికి అనుగుణంగా ప్రజలలో మనోధైర్యాన్ని నింపేలా ప్రతిరోజు పెట్రోలింగ్, ఫ్లాగ్‌మార్చ్‌లను నిర్వహించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న(అండర్ ఇన్వెస్టిగేషన్) కేసులలో గ్రేవ్, నాన్‌గ్రేవ్ కేసుల గురించి పోలీసు అధకారులను అడిగి తెలుసుకున్నారు. గ్రేవ్, నాన్‌గ్రేవ్ కేసులలో ఇన్వెస్టిగేషన్ చేసేటప్పుడు ఏవిధంగా ఇన్వెస్టిగేషన్ చేయాలని, ఏఏ అంశాలు క్రోడీకరించాలని తదితర అంశాల గురించి వివరించారు. ప్రతి కేసులో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ ఉండాన్నారు. అనంతరం జాతీయ లోక్‌అదాలత్‌లో భాగంగా కోర్టులలో ఉన్న కేసులను రాజీమార్గం దిశగా కృషిచేసి బాధితులకు సత్వరన్యాయం అందించిన రెబ్బెన సీఐ చిట్టిబాబు, ఆసిఫాబాద్‌టౌన్ సీఐ సతీష్, కాగజ్‌నగర్ టౌన్ సీఐ శంకరయ్య, రెబ్బెన ఎస్సై చంద్రశేఖర్, ఆసిఫాబాద్‌టౌన్ ఎస్సై మహేందర్, హెడ్‌కానిస్టేబుళ్లు బాపురావు, సత్యనారాయణ, కానిస్టేబుల్ ఉమేష్‌కు ఎస్పీ ప్రశంసాపత్రాలు అందించారు. సమావేశంలో డీఎస్పీలు సదయ్య, కరుణాకర్, సీఐలు రాణాప్రతాప్, డీసీఆర్బీ ఇన్స్‌పెక్టర్ రమేష్, సీఐలు,ఆర్‌ఐలు, ఎస్సైలు, డీపీవో ఏవో శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ దోత్రే



మీడియా సెంటర్‌ను ప్రారంభిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, మార్చి 19: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఎన్నికల సంబంధిత ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్‌ను అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి, జిల్లా పౌరసంబంధాల అధికారి సంపత్‌కుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉన్నందున అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. ఎన్నికల నిర్వహణలో నిబంధనలు ఉల్లంఘించినట్లయితే టోల్‌ఫ్రీ నెంబరుతో పాటు మీడియాసెంటర్‌లో ఏర్పాటు చేసిన ఫోన్ నెం.08733-279033ను సంప్రదించాలన్నారు.

పోలింగ్ శాతం పెంచేందుకు చర్యలు

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ దోత్రే

వాంకిడి, మార్చి 19: లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా జిల్లాలోమే13న జరగనున్న పోలింగ్‌లో ఓటింగ్ శాతాన్ని పెంచే విధంగా చర్యలు తీసుకుంటున్నామని జిల్లాఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. మంగళవారం వాంకిడి మండలం సోనాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని అదనపుకలెక్టర్(స్థానికసంస్థలు) దీపక్ తివారితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు చేపడుతున్నామన్నారు. మే13న జరగనున్న పోలింగ్‌రోజు ఓటు హక్కు గల ప్రతిఒక్కరూ తమఓటు వేసే విధంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. జూన్6న ఎన్నికల ప్రక్రియ ముగుస్తుందని, అప్పటి వరకు ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉంటుందని తెలిపారు. సోనాపూర్ గ్రామంలోని ఆదర్శ అంగన్‌వాడీకేంద్రాన్ని సందర్శించి అధికారులు, సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. కేంద్రం పరిధిలో పిల్లల సంరక్షణ బాధ్యతాయుతంగా నిర్వహించాలని తెలిపారు. అనంతరం గ్రామాల్లో వైకుంఠధామం, వర్షపు నీటి నిలువ యూనిట్లను పరిశీలించారు. వైకుంఠదామంలో నీరు, విద్యుత్ ఇతర సౌకర్యాలను ప్రజలు వినియోగించుకునే విధంగా అవగాహన కల్పించాలని తెలిపారు. వేసవి కాలమైనందున భూగర్భ జలశాతాన్ని పెంచేందుకు చర్యలు చేపట్టాలని తెలిపారు. అనంతరం వాంకిడి చెక్‌పోస్టును తనిఖీ చేసి రిజిస్టర్లను పరిశీలించారు. ఎన్నికల నిర్వహణకు పూర్తిస్థాయి ఏర్పాట్లు చేసి, ప్రజలను ప్రలోభపెట్టే నగదు, మద్యం, కానుకల రవాణా జరగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు.



ఆసిఫాబాద్‌లో ఆదర్శ అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

పిల్లల ఆరోగ్య స్థితిగతులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి

ఆసిఫాబాద్: అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో పిల్లల ఆరోగ్య స్థితిగతులను పర్యవేక్షించి అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని జన్కాపూర్ ఆర్‌ఆర్‌కాలనీలో గల ఆదర్శ అంగన్‌వాడీకేంద్రాన్ని అదనపు కలెక్టర్ దీపక్‌తివారితో కలిసి తనిఖీచేశారు. అంగన్‌వాడీ కేంద్రం పరిసరాలు, గదులు, రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిల్లలు, గర్భిణులు, కిశోర బాలికల సంరక్షణ కోసం పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందిస్తున్నామన్నారు.

అంగన్‌వాడీ అధికారులు, సిబ్బంది తమ కేంద్రం పరిధిలోని పిల్లలబరువు, ఎదుగుదల, మానసిక పరిస్థితులపై పర్యవేక్షిస్తూ వారికి అవసరమైన పోషకాహారాన్ని అందించాలని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో గర్భందాల్చిన మహిళలు తమ వివరాలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రులలో నమోదు చేసుకునే విధంగా అవగాహన కల్పించాలన్నారు. ఆసుపత్రులలోనే ప్రసవాలు చేసుకునే విధంగా చూడాలని అన్నారు. అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారాన్ని సకాలంలో పంపిణీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు అంకితభావంతో పనిచేయాలి: కలెక్టర్



బాలసదన్‌ను సందర్శిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్‌రూరల్, మార్చి 19: బాల్యవివాహాలు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు అధికారులు అంకితభావంతో పనిచేయాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని జన్కాపూర్‌లోగల బాల రక్షా భవన్‌ను అదనపుకలెక్టర్(స్థానిక సంస్థలు) దీపక్‌తివారితో కలిసి సందర్శించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో బాల్యవివాహాలు, బాల కార్మికుల వ్యవస్థ నిర్మూలనకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలపై ప్రజలకు తెలిసే విధంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతోపాటు బాల్యవివాహాలు జరుగుతు న్నట్లుగా తెలిస్తే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. బాలల సంరక్షణకొరకు చైల్డ్‌హెల్ప్‌లైన్ 1098ఏర్పాటు చేశామన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ



ఎరువుల దుకాణాలను తనిఖీ చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు

పెంచికలపేట, మార్చి 19: మండలంలోని ఎరువుల దుకాణాలను మంగళవారం జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు తనిఖీచేశారు. ఈ-పాస్ మిషన్‌తో మాత్రమే అమ్మకాలు చేయాలని దుకాణాదారులకు సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొనుగోలు చేసిన రైతుకు బిల్లులు అందజే యాలన్నారు. ఆయన వెంట వ్యవసాయాధికారి రాజుల నాయుడు ఉన్నారు.

పలు మండలాల్లో అకాల వర్షం



బెజ్జూరులో నేలకొరిగిన చెట్టు



కౌటాలలో తడిసి ముద్దయిన మిర్చీ పంట

బెజ్జూరు/కౌటాల/చింతలమానేపల్లి, మార్చి 19: మండలంలో మంగళవారం వర్షం కురిసింది. కొద్దిరోజులుగా ఎండ తీవ్రత ఉన్న క్రమంలో ఒక్కసారిగా వర్షం కురవడంతో వాతావరణం చల్లబడింది. ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రజలకు ఊరట కలిగించింది. గాలితో కూడిన వర్షం కురవడంతో గోల్కొండ-హేటిగూడ గ్రామాల మధ్యచెట్టు విరిగిపడడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. కాగా పలుగ్రామాల్లో రైతులుమిర్చీ ఆరబెట్టడంతో వర్షానికి తడిసి ముద్దయ్యాయి.

కూలీలు ఉపాధి పనికి హాజరు కావాలి



పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో కృష్ణారావు

కెరమెరి, మార్చి 19: ఉపాధిహామీ జాబ్‌కార్డు కలిగిఉన్న ప్రతిఒక్కరు పనికి హాజరుకావాలని ఎంపీడీవో కృష్ణారావు అన్నారు. బుధవారం ఆయన సాంగ్వీ గ్రామంలో జరుగుతున్న పనులను పరిశీలించారు. అనంతరం పనులపై గ్రామ సభ ఏర్పాటుచేసి మాట్లాడారు. జాబ్‌కార్డుకలిగిన ప్రతిఒక్కరు ఉపాధిపనికి హాజరు కావాలన్నారు.ఆయనవెంట ఏపీవోమల్లయ్య, కార్యదర్శి గణేష్ ఉన్నారు.



గుర్తింపు పత్రం ఇవ్వడంలో ఆలస్యమెందుకు?

శ్రీరాంపూర్, మార్చి 19: గుర్తింపు పత్రం ఇవ్వడంలో ఆలస్యమెందుకు అని ఏఐటీయూసీ అదనపు ప్రధానకార్యదర్శి మిర్యాల రంగయ్య సింగరేణి యాజమాన్యాన్ని ప్రశ్నించారు. ఆర్‌కే6గనిపై మంగళవారం గేట్‌మీటింగ్ నిర్వహించగా, ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో తమ యూనియన్ గెలిచి మూడు నెలలైనా ఇంతవరకు గుర్తింపుపత్రం ఇవ్వకపోవడం సరికాదన్నారు. ఈ విషయంలో యాజమాన్యం ఎందుకు వెనకడుగు వేస్తుందో చెప్పాలని ఆయన ప్రశ్నించారు. కార్యక్రమంలో ఉప ప్రధానకార్యదర్శి ముష్కె. సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, తదితరులు పాల్గొన్నారు.

ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకున్న ఆర్కే5 గని

శ్రీరాంపూర్, మార్చి 19: శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే5 గని 2023-24 వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని ముందుగానే చేరుకుంది. ఈనెల31లోగా 2లక్షల 70వేల టన్నుల బొగ్గును వెలికితీయాల్సి ఉంది. కానీ 11నెలల 20రోజుల్లో అనగా, ఇంకా 11రోజులు మిగిలి ఉండగానే మంగళవారం నాటికే 100శాతం ఉత్పత్తిని సాధించింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని మేనేజర్ అబ్దుల్ ఖాదిర్ ఆధ్వర్యంలో గనిపై సంబరాలు చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, తమ గని ఉద్యోగులు ఎంతో నిబద్ధత కలిగిన వారు అని, వారికి ఇచ్చిన లక్ష్యాన్ని అనుకున్న మేర సాధిస్తారని కొనియాడారు. ఏరియా మేనేజర్ బి సంజీవరెడ్డి, గ్రూప్ ఏజెంట్ ఏవీ రెడ్డి సూచనలు, సలహాలు, సహాయ సహకారాలతో ఉద్యోగులు లక్ష్యాన్ని సాధించినట్లు వివరించారు.

బీసీ ఉద్యోగుల సంఘం కార్యవర్గం

శ్రీరాంపూర్, మార్చి 19: సింగరేణి కాలరీస్ బీసీ, ఓబీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం శ్రీరాంపూర్ ఏరియా కమిటీని మంగళవారం ఏర్పాటు చేశారు. ఏరియా అధ్యక్షుడిగా శ్రీరాంపూర్ ఓసీపీలో సర్వే మజ్దూర్‌గా పనిచేస్తున్న బరపటి మారుతి, ప్రధానకార్యదర్శిగా ఇందారం ఓసీపీలో జనరల్‌మజ్దూర్‌గా పనిచేస్తున్న బొడిగె చంద్రశేఖర్ నియమితుల య్యారు. ఈ మేరకు సంఘం కేంద్ర ముఖ్య కార్యనిర్వహణ కార్యదర్శి పేరం రమేష్ ఉత్తర్వులు జారీ చేశారు. బీసీ, ఓబీసీ ఉద్యోగుల ప్రమోషన్ పాలసీ అమలుకు కృషి చేస్తామని, వారు ఎదుర్కొంటున్న పనిఒత్తిడి, వేధింపుల నుంచి విముక్తి కలిగిస్తామని, హక్కుల సాధనకు పాటుపడతామని ఆయన పేర్కొన్నారు.

మాస్ కాపీయింగ్ జరగకుండా పటిష్ట చర్యలు: కలెక్టర్

ఆసిఫాబాద్ రూరల్, మార్చి 19: జిల్లాలో పదవతరగతి వార్షిక పరీక్షల్లో ఎలాంటి మాస్ కాపీయింగ్ జరగకుండా పటిష్టమైన చర్యలు చేపట్టామని కలెక్టర్ వెంటేష్ దోత్రే అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని జడ్పీ బాలికల ఉన్నతపాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షాకేంద్రాలలో జరుగుతున్న పదవతరగతి వార్షికపరీక్షలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో జరుగుతున్న పదవతరగతి వార్షిక పరీక్షల నిర్వహణకు పూర్తిస్థాయి ఏర్పాట్లు చేశామన్నారు. పరీక్షలనిర్వహణకు ఫ్లయింగ్‌స్క్వాడ్, మొబైల్‌బృందాలతో పరీక్షల నిర్వహణను పర్యవేక్షిస్తామన్నారు. పరీక్షా కేంద్రాలవద్ద జిరాక్స్‌సెంటర్లు మూసివేతతో పాటు పోలీసుల బందోబస్తు, 144 సెక్షన్ అమలు చేస్తున్నామన్నారు. ఎలక్ట్రానిక్ పరికరాలు, మొబైల్స్ నిషేధం ఉంటుందని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద వైద్య సిబ్బంది ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రాథమిక చికిత్స కిట్లతోపాటు ఓఆర్ఎస్‌ప్యాకెట్లు, అవసరమైన మందులతోపాటు వైద్యసిబ్బంది అందుబాటులో ఉంచామన్నారు.



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

బాధిత మహిళలకు సఖి కేంద్రంలో ఆశ్రయం

లైంగిక వేధింపులు, గృహహింస, ఈవ్‌టీజింగ్ బాధితబాలికలు, యువతులు, మహిళలకు సఖీ కేంద్రంలో ఆశ్రయం కల్పించి అవసరమైన న్యాయసేవలు అందిస్తామని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని సఖీ కేంద్రాన్ని అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) దీపక్ తివారితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాధిత మహిళలకు సఖికేంద్రంలో ఆశ్రయం కల్పించి అవసరమైన సేవలు అందించాలన్నారు. సఖీ కేంద్రంలో న్యాయ, పోలీసు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది సమన్వయంతో మహిళలకు ఇబ్బందులు లేకుండా సేవలు అందించాలని తెలిపారు. అవసరమైన వారికి కౌన్సెలింగ్ అందించి మహిళలకు ఆత్మస్థైర్యాన్ని కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో సఖీ కేంద్రం నిర్వాహకులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

రెండు రోజుల్లో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తాం

కాగజ్‌నగర్ టౌన్, మార్చి 19: లారీ యాజమానులు, కార్మికుల సమస్యలను ఎస్పీఎం యాజమాన్యం రెండ్రోజుల్లోగా పరిష్కరించకుంటే ఆందోళనను తీవ్రతరం చేస్తామని లారీ యాజమానుల సంఘం అధ్యక్షుడు వెన్న కిషోర్‌బాబు హెచ్చరించారు. మంగళవారం స్థానికంగా ఆయన మాట్లాడారు.

ఎస్పీఎం యాజమాన్యం గతంలో లారీ యాజమానులకు లోడింగ్ విషయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా మొండి వైఖరి అవలంభిస్తోందన్నారు. ఉత్పత్తి ఆధారంగా లారీలకు లోడింగ్ ఇస్తామని చెప్పినప్పటికీ అమలు పర్చలేదన్నారు. 30శాతం లారీ కిరాయిలు పెంచాలని డిమాండు చేశారు.

మిల్లు వాహనాల ద్వారా ఓవర్‌లోడ్ విషయంలో జిల్లా కలెక్టర్, డీటీవోకు ఫిర్యాదు చేశామన్నారు. సమావేశంలో కార్యదర్శి నిజాముద్దీన్, లారీ యాజమానులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

రూ.85 వేల నగదు పట్టివేత

సిర్పూర్(టి), మార్చి 19: మండలంకేంద్రంలోని పోలీసుస్టేషన్ ఎదుట మంగళవారం వాహనాల తనిఖీల్లో భాగంగా ఎలాంటి ధ్రువపత్రాలు లేకుండా తీసుకెళ్తున్న రూ.85వేల నగదును పట్టుకున్నట్లు ఎస్సై దీకొండరమేష్ తెలిపారు. చెన్నూరుకు చెందిన నజీర్‌ఖాన్ నగదుతో మహారాష్ట్రకు వెళ్తుండగా తనిఖీల్లో పట్టుబడినట్లు తెలిపారు.

ఎస్పీఎం గోడ కూల్చివేతలో ఇరువర్గాల ఫిర్యాదు

కాగజ్‌నగర్, మార్చి 19: ఎస్పీఎం అడ్డుగోడలు తొలగించినందుకు మున్సిపల్ కమిషనర్ అంజయ్య, పలువురు కౌన్సిలర్లపై కాగజ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం రాత్రి కేసు నమోదు అయినట్టు సీఐ శంకర్య తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం తమ పరిధిలో ఉన్న గోడలను అకారణంగా కూల్చివేశారని ఎస్పీఎం ప్రతినిధి గిరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు సీఐ వివరించారు.

ఎస్పీఎం ప్రతినిధులపై..

మాస్టర్ ప్లాన్ అమల్లో భాగంగా ఎస్పీఎం అడ్డుగోడలను తొలగిస్తుండగా తమ విధులకు ఆటంకం కల్పించారని మున్సిపల్‌కమిషనర్ అంజయ్య మంగళవారం రాత్రి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్పీఎం ప్రతినిధులు ఏకే మిశ్రా, శ్రీమన్నారాయణ, ఆర్ రమేష్, సతీష్‌సింగ్ తమను అడ్డుకున్నారని కులం పేరుతో దూషించినట్టు తెలిపారు. వీరిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కమిషనర్ అంజయ్య పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

కైరిగూడ ఓసీని సందర్శించిన డైరెక్టర్

రెబ్బెన, మార్చి 19: కైరిగూడ ఓసీని మంగళవారం డైరెక్టర్ ఆపరేషన్స్ శ్రీనివాస్ సందర్శించారు. ఈసందర్భంగా వివిధసమస్యలపై జీఎం రవిప్రసాద్‌ను అడిగితెలుసుకున్నారు. ఆయనవెంట అధికారులు మచ్చగిరి నరేందర్, ప్రాజెక్టు అధికారి సత్యనారాయణ, సిబ్బంది ఉన్నారు.